వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

- ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగురూరల్, జూన్ 10 : వర్షాకాలంలో అధికారులు మూడు నెలల పాటు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆమె అధికారులతో మాట్లాడారు. జిల్లా అధికారులు, నోడల్ అధికారులు, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన మరమ్మతు పనులు చేపట్టి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని ఆదేశించారు. రెడ్‌జోన్‌లో ఉండే ప్రాంతాలపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీజ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డితో కలిసి ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 55 దరఖాస్తులు స్వీకరించారు. అందులో రెవెన్యూ శాఖ 20, ఉద్యోగ ఉపాధి కోసం 9, పింఛన్ 9, ఇతర శాఖలకు చెందిన 15 దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించి ఆయా శాఖల అధికారులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, డీఎంహెచ్‌వో అప్పయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, జిల్లా పశు వైద్యాధికారి రవికుమార్, విద్యుత్ డీఈ నాగేశ్వర్‌రావు, ఇరిగేషన్ డీఏవో అప్పలనాయుడు, డీఈవో పాణిని, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌చంద్ర, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, డీసీవో సర్దార్‌సింగ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

అదనపు కలెక్టర్ శ్రీజ

తాడ్వాయి: మాట్లాడుతున్న శ్రీజ

తాడ్వాయి, జూన్ 10 : అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. మండలంలోని పలు పాఠశాలల్లో అభివృద్ధి పనులను సోమవారం పరిశీలించారు. మండలకేంద్రంలోని ఇందిరానగర్, కామారంతో పాటు మండలంలోని రెడ్డిగూడెం పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలలో బడిబాట కార్యక్రమంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులకు సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, మండల ప్రత్యేకాధికారి అప్ప య్య, సమగ్ర శిక్షణ అభియాన్ సిబ్బంది ఉన్నారు.

నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేయాలి

ములుగురూరల్: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లాలోని చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 20న చేపట్టే నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో పాఠశాలల్లో చదివే విద్యార్థులతో పాటు బడి బయట ఉన్న పిల్లలకు మాత్రలు అందించాలన్నారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ సమావేశ మందిరంలో డీఎంహెచ్‌వో అప్పయ్య ఆధ్వర్యంలో జిల్లాలోని వైద్యాధికారులు, సిబ్బందికి నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం పై ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రోగ్రాం అధికారి రణధీర్, వైద్యాధికారులు శ్రీకాంత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు త్వరగా పరిష్కరించండి

భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే

ప్రజాదివస్‌లో మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి రూరల్, జూన్ 10 : పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజాదివస్ కార్యక్రమం నిర్వహించి 16 మంది బాధితుల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితులకు న్యాయం అందించే విషయంలో పటిష్టంగా పనిచేయాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. చట్టాలను అతిక్రమిస్తూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కోర్టు కేసుల్లో ఉన్న భూ తగాదాల విషయంలో కోర్టు ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాలని, బాధితుల సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లాలోని ఎస్సైలు, సీఐలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Wanted Experience (M&F) Local & Kerala Teachers for Primary Hindi, English higher section Hindi Good Salary for fluent English, ELOHIM SCHOOL, Kommala, Wgl. 9390112329, 7702026999.
NTW-318919

CHANGE OF NAME

★I, **GOPAGONI RAVI, S/o. GOPAGONI SAYABJILLA,** R/o. H.No. 5-79, Main Road, Narmetta (V&M), Jangaon Dist., T.S., My Father Name is **GOPAGONI SAYABJILLA** alias **SAYABJEELA** is one and the same all further purposes.
NTW-5698

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556
9182777557 JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135 JANGAON
9182777565

ప్లాస్టిక్ రహిత కలెక్టరేట్‌గా తీర్చిదిద్దాలి

- అధికారులు, సిబ్బంది తప్పక బయో మెట్రిక్ హాజరు వేయాలి
- మితమైన ఆహారం ఆరోగ్యానికి మంచిది
- భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, జూన్ 10 : వారం రోజుల్లో సమీకృత కలెక్టర్ కార్యాలయాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, బయోమెట్రిక్ హాజరు, సీసీ కెమెరాల పనితీరు, కలెక్టరేట్ గార్డెన్ నిర్వహణ, ఉద్యోగుల సంక్షేమం, వాహనాల పార్కింగ్, సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు, తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. మార్పు మన కలెక్టరేట్ నుంచి ప్రారంభం కావాలని అధికారులకు సూచించారు. ప్లాస్టిక్ బాటిల్లో నీళ్లు తాగడం వల్ల రోగాల బారిన పడతామని, స్టీల్, సీసా బాటిళ్లను వినియోగించాలని సూచించారు. ప్రతి రోజూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అలాగే అధికారులు, సిబ్బంది తప్పక బయో మెట్రిక్ హాజరు వేయాలని, హాజరు నివేదికలు ప్రతి రోజూ అందించాలని ఏవోకు సూచించారు. కలెక్టరేట్‌లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటి రక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ వినియోగం తగ్గించేందుకు సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యాలయం నుంచి బయటకు వెళ్లేటప్పుడు విధిగా ఫ్యాన్లు, ఏసీలు, లైట్లు ఆఫ్ చేసి వెళ్లాలని సూచించారు. కలెక్టరేట్ అవతల బస్టాప్ నిర్మాణం చేపట్టాలని, 15 రోజుల్లో పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఉద్యోగుల పరిరక్షణ చర్యల్లో భాగంగా హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. అధికారులు, సిబ్బంది ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, మితమైన ఆహారం ఆరోగ్యానికి మంచిదని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలు వెంటనే పరిష్కరించండి

ప్రజావాణి సమస్యలకు అధిక ప్రాధాన్యతనిచ్చి సత్వరమే పరిష్కారం చూపాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. సోమవారం జిల్లా అధికారులతో కలిసి ఆయన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం, పింఛన్లు తదితర సమస్యలపై 52 దరఖాస్తులు వచ్చాయన్నారు. పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్‌మెంట్ చేశామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని, శాఖల వారీగా పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ఒక వేళ దరఖాస్తులు తిరస్కరణకు గురైతే పూర్తి వివరాలను సంబంధిత దరఖాస్తు దారుడికి తెలపాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మేడిగడ్డ ఎగువ ప్రాంత ఇసుక తీయాలి

వర్షాకాలంలోపు మేడిగడ్డ ఎగువ ప్రాంతంలో ఉన్న బ్యాలెన్స్ ఇసుకను తీయాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రధానంగా మూడు అంశాలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం లోపు మేడిగడ్డ ఎగువ ప్రాంతంలో ఉన్న బ్యాలెన్సింగ్ ఇసుక తీసేందుకు ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు. కాటారం మండలంలోని విలాసాగర్ గ్రామం వద్ద ఉన్న మానేరు నదిలోని ఇసుక, టేకుమట్ల మండలంలోని చలివాగు బ్రిడ్జి సమీపంలో ఉన్న 2 లక్షల మెట్రిక్ టన్నుల ఇసునకు తీసి ప్రభుత్వ పనులు, స్థానిక అవసరాలకు గ్రామాల ప్రజలు వినియోగించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మైనింగ్ ఏడీ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి

బాధ్యతలు తీసుకుంటున్న హరీశ్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ, జూన్ 10 : భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సమక్షంలో ఆయన సోమవారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ హరీశ్‌రెడ్డి మున్ముందు రోజుల్లో రాజకీయ రంగంలో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆశీర్వదించి, శాలువాతో సన్మానించారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ తాను వైస్ చైర్మన్‌గా ఎన్నికైన నాటి నుంచి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల ప్రజలకు అందుబాటులో ఉన్నానన్నారు. వేసవిలో అన్ని వార్డుల్లో పర్యటించి తాగునీటి సమస్యను దగ్గరుండి పరిష్కరించినట్లు తెలిపారు. శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టిపెట్టి కాలనీలన్నింటినీ సర్వాంగ సుందరంగా తయారు చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్దు, బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్ యాదవ్, కౌన్సిలర్లు మేకల రజితా మల్లేశ్, మంగళపెల్లి తిరుపతి, ఎడ్ల మౌనికా శ్రీనివాస్, ముంజంపెల్లి మురళీధర్, నాగుల శిరీషా దేవేందర్ రెడ్డి, నూకల భూలక్ష్మి, మాడ కమలా లక్ష్మారెడ్డి, పానుగంటి హరికా శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బుర్ర రమేశ్, శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ కుమార్‌రెడ్డి, నాయకులు ఎండీ కరీం, మాడ హరీశ్‌రెడ్డి, సింగనవేని చిరంజీవి, రాజు, శ్రీకాంత్ పటేల్, కవ్వంపెల్లి శేఖర్, మల్లికార్జున్ యాదవ్, యూత్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని వైస్ చైర్మన్ హరీశ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

న్యాయం కోసం మృతుల బంధువుల ధర్నా

జాతీయ రహదారిపై బైఠాయింపు

ధర్నా చేస్తున్న మృతుల కుటుంబసభ్యులు

భూపాలపల్లి రూరల్, జూన్ 10 : భూపాలపల్లి మండలం కమలాపూర్, రాంపూర్ మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రేగుల రాకేశ్, రేగుల ప్రమోద్ కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి జాతీయ రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం రాత్రి ఇన్నోవా కారు బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారని, మరొకరు చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. రాకేశ్‌కు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని, ఇప్పుడు వారి పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడి కారుకు ఇన్సూరెన్స్ కూడా లేదని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు ఈ ధర్నా కొనసాగిస్తామని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే గండ్ర పరామర్శ

రేగుల రాకేశ్, రేగుల ప్రమోద్ కుటుంబ సభ్యులను సోమవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కలిసి పరామర్శించారు. అనంతరం డీసీసీ సంపత్‌రావును కలిసి రోడ్డు ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని, ప్రమాదానికి కారకులైన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఓవర్‌లోడ్ ఇసుక లారీల స్వాధీనం

ఏటూరునాగారం, జూన్ 10 : జిల్లాలోని వెంకటాపురం, ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, గోవిందరావుపేట, ములుగు మండలాల్లో పోలీసులు ఏక కాలంలో నిర్వహించిన తనిఖీల్లో సోమవారం రాత్రి సుమారు 50 లారీలు ఓవర్‌లోడుతో పట్టుబడ్డాయి. వీటిపై కేసులు నమోదు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. రోజు 650కు పైగా లారీల్లో ఇసుక రవాణా జరుగుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు తనిఖీలు చేపడితే వందల సంఖ్యలో ఓవర్‌లోడుతో వెళుతున్న లారీలు పట్టుబడే అవకాశాలు ఉన్నాయి. ఇసుక రీచ్‌ల వద్ద వే బ్రిడ్జిలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం అధికారులపై ఎంతైనా ఉంది. ఇక ఓవర్ లోడును అదుపులోకి తెస్తే రోడ్లు దెబ్బతినకుండా ఉండే అవకాశాలు ఉన్నాయి.

పోలీసులు స్వాధీన పర్చుకున్న లారీలు

బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ ఆర్థిక సాయం

సాయం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తాడ్వాయి, జూన్ 10 : మండలంలోని ఊరట్టం గ్రామపంచాయతీ పరిధి కొత్తూరు గ్రామానికి చెందిన గజ్జల రామయ్య మృతిచెందగా వారి కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు ఆర్థిక సాయం చేశారు. రామయ్య మృతితో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటుండడంతో గొంది శ్రీధర్, రాంబాబు, మహేశ్, సమ్మయ్య, నవీన్, రాములు, మహేందర్ సోమవారం వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఖర్చుల కోసం రూ. 5 వేలు అందజేశారు.

ఉద్యమకారుడికి జాతీయ ఉత్తమ పురస్కారం

టేకుమట్ల/ కాటారం, జూన్10 : మండలంలోని ద్వారకపేట గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బీఆర్ఎస్ మండల తొలి అధ్యక్షుడు కత్తి సంపత్‌గౌడ్ ప్రొఫెసర్ జయశంకర్ జాతీయ ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. సోమవారం బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని పుణెలో ఆ సంస్థ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి చిట్యాల నుంచి ఉద్యమాన్ని తారా స్థాయికి చేర్చడం కోసం ప్రజలను భాగస్వామ్యులను చేయడం, ఆర్ఎంపీగా పేదలకు వైద్య సేవలు అందించినందుకు అవార్డు వచ్చిందని సంపత్ తెలిపారు. అలాగే కాటారానికి చెందిన స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు కొట్టె సతీశ్‌ను జాతీయ సేవా రత్న అవార్డు వరించింది. విదేశాల్లో ఉన్నత విద్య, స్వదేశంలో గ్రామీణ అభివృద్ధిలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి సొంత ఊరులో స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు ప్రముఖ గాయకుడు రాంబాబు చేతుల మీదుగా అవార్డును అందజేశారు.

నాయకపోడుల ఉనికిని కాపాడాలి

ములుగురూరల్, జూన్ 10 : ఆదివాసీ నాయకపోడు కులస్తుల సంప్రదాయాలను కాపాడుతూ ఉనికిని కాపాడాలని ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కూనదయానందం అన్నారు. సోమవారం గట్టమ్మ దేవాలయం వద్ద జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్న ఆదివాసీ కులస్తుల పేర్లను ఏటూరునాగారం ఐటీడీఏ వెబ్‌సైట్‌లో పొందుపర్చలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో వెబ్‌సైట్‌లో నాయకపోడుల ఆచారం, సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విధి విధానాలు ఉండేవన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ వివరాలను వెబ్‌సైట్‌లో తీసివేయడం దురదృష్టకరమని అన్నారు. ఈ విషయమై కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ పీవోకు దరఖాస్తులు ఇచ్చినా స్పందించడంలేదని తెలిపారు. ఆదివాసీ నాయకపోడు కార్పొరేషన్ ఏర్పాటు చేసి దానికి ఐఏఎస్ అధికారిని చైర్మన్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రాజన్న, మల్లేశ్, రాజన్న, రామకృష్ణ, భూమయ్య, సతీశ్, కృష్ణ, అంజయ్య, నరేశ్, సమ్మయ్య, భీమయ్య, లక్ష్మయ్య, రాజు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించే రైస్ మిల్లర్లపై చర్యలు తప్పవు

మిల్లర్లతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ

ములుగురూరల్, జూన్10 : సీఎంఆర్ ధాన్యం విషయంలో నిర్లక్ష్యం వహించే రైస్ మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీ అన్నారు. సోమవారం సివిల్‌సప్లై అధికారులు, రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంఆర్ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ఎగుమతులు, దిగుమతులు, సీఎంఆర్ ధాన్యం సరఫరా విషయంలో రైస్ మిల్లర్లు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై డీఎం రాంపతి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ప్రవీణ్, అధ్యక్ష, కార్యదర్శులు కాట్రగడ్డ సతీశ్‌కుమార్, గోపు వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

సీఎన్‌జీ గ్యాస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

గ్యాస్ సేవలను ప్రారంభిస్తున్న ఎస్ఐ సాంబమూర్తి

గణపురం, జూన్ 10 : వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు సీఎన్‌జీ గ్యాస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై మచ్చ సాంబమూర్తి అన్నారు. సోమవారం మండలంలోని చెల్పూర్ సునీత ఫిల్లింగ్ స్టేషన్‌లో వాహనాల గ్యాస్ సేవలను ఎస్సై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పట్టణ ప్రాంతాల్లో మాత్రమే సీఎన్‌జీ గ్యాస్ సేవలు అందుబాటులో ఉండేవని సోమవారం నుంచి జిల్లాలో మొదటి సారిగా మెగా కంపెనీ ఆధ్వర్యంలో చెల్పూర్‌లో ఏర్పాటు చేయడం అభినందనీయన్నారు. కార్యక్రమంలో ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకుడు లక్కం ప్రభాకర్, చెల్పూర్ సొసైటీ వైస్ చైర్మన్ కావటి రవీందర్, మాజీ సర్పంచ్ కొత్త వెంకన్న, మెగా కంపెనీ ప్రతినిధులు, నాయకులు పిన్నింటి మాధవరావు, సూరినేని సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ గేటు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

ములుగురూరల్, జూన్19 : సివిల్ సప్లై అధికారులు సీజ్ చేసిన సాయి సహస్ర రైస్ మిల్లు యజమాని మహేందర్‌రావు నుంచి తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని కోరుతూ సోమవారం పలువురు రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసంగిలో తాము పండించిన ధాన్యాన్ని సంబంధిత రైస్ మిల్లులో విక్రయించామని, గత నెల 8న సివిల్ సప్లై అధికారులు మిల్లుపై దాడులు చేసి సీఎంఆర్ రికవరీ కోసం అందులో ఉన్న తమ ధాన్యాన్ని సీజ్ చేశారని అన్నారు. అప్పటి నుంచి సదరు రైస్‌మిల్లు యజమాని మహేందర్‌రావు తమకు డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులు స్పందించి డబ్బులు ఇప్పించాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి, జిల్లా సాధన సమితి అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్ వారికి మద్దతు తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు మహేందర్‌రావును రైతుల వద్దకు తీసుకొని రాగా 15 రోజుల్లో డబ్బులు చెల్లిస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

ఈ నెల 14న సదరం క్యాంపు

కృష్ణకాలనీ, జూన్ 10 : ఈనెల 14, 28వ తేదీల్లో సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నరేశ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాజరయ్యేవారు మీసేవ కేంద్రాల్లో రెన్యువల్, కొత్తగా దరఖాస్తులను చేసుకోవాలన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న వారికి మాత్రమే సదరం క్యాంపులో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. దివ్యాంగులు కొత్తవి 30, రెన్యువల్ 20, వినికిడి లోపం కొత్తవి 15, రెన్యువల్ 10, మానసిక దివ్యాంగులు కొత్తవి 15, రెన్యువల్ 10, కంటిచూపు కొత్తవి 20, రెన్యువల్ 5 ఉన్నాయన్నారు. అన్ని మండలాల వారికి జిల్లా కేంద్రంలోని ప్రధాన దవాఖానలో క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తుచేసుకున్న వారు సదరం క్యాంపునకు హాజరుకావాలని సూచించారు.

హామీలు నెరవేర్చాలి..

ములుగురూరల్, జూన్ 10 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎంసీపీఐ(యూ) నాయకుడు చంద్రయ్య సోమవారం పార్టీ నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా హామీలపై సీఎం దృష్టి పెట్టడం లేదన్నారు. ఆయన వెంట ఎంసీపీఐ(యూ) నాయకులు ఉన్నారు.

జడ్పీ డిప్యూటీ సీఈవోగా కృష్ణప్రసాద్

కృష్ణప్రసాద్‌ను సన్మానిస్తున్న జడ్పీ కార్యాలయ ఉద్యోగులు

ములుగురూరల్, జూన్ 10 : ములుగు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా కృష్ణప్రసాద్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి నియమించారు. మంగపేట మండలం ఎంపీడీవోగా పనిచేస్తున్న కృష్ణప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నియామక ఉత్తర్వులను జారీ చేయగా, ఆయన సోమవారం ములుగు జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయంలో విధుల్లో చేరారు. ఈ మేరకు ఆయనను కార్యాలయ ఉద్యోగులు శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు.

పీహెచ్‌సీలో వైద్యసేవలు..

వాజేడు, జూన్ 10 : మండలంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెలా రెండో సోమవారం డీఎంహెచ్‌వో అలెం అప్పయ్య ఆదేశాల మేరకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ మేరకు సోమవారం మానసిక వైద్య నిపుణులు నర్మద మానసికంగా బాధ పడుతున్న పిల్లలకు పరీక్షలు చేసి, వారి తల్లిదండ్రులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మహేందర్, మధుకర్, హెల్త్‌సూపర్ వైజర్ కోటిరెడ్డి